అ'పూర్వ' సమ్మేళనం



మందమర్రిరూరల్: 2004-05 బ్యాచ్ విద్యార్థులు



మందమర్రిరూరల్: 1997-98 బ్యాచ్ విద్యార్థులు



బెల్లంపల్లి: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మందమర్రి పట్టణంలోని జెడ్పీ (గర్ల్స్) హైస్కూల్‌లో 1997-98లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 28 ఏళ్ల తర్వాత, బెల్లంపల్లిలోని వాణినికేతన్ ఉన్నత పాఠశాలలో 2001-02 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 24 ఏళ్ల తర్వాత, మందమర్రి పట్టణంలోని కార్మెల్ హైస్కూల్‌లో 2004-05 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు. నాడు విద్యాబుద్ధులు నేర్పించి తమ ఉన్నతికి కృషి చేసిన గురువులకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. - బెల్లంపల్లి/మందమర్రిరూరల్

క్లుప్తంగా

వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ



ఎన్నుకున్న పరిరక్షణ కమిటీ

మంచిర్యాలటౌన్: వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలో ఆదివారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.శివకుమార్ సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా దొమ్మటి కిరణ్‌కుమార్, కార్యదర్శులుగా ఆర్.రాజేశ్, జాయింట్ సెక్రటరీగా యు.ప్రభాకర్, ఇ.వినోద్‌కుమార్, ఉమ్మడి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా తన్నీరు హేమవతి, ఉపాధ్యక్షుడిగా పొనగంటి శివలను ఎన్నుకున్నారు. వారికి నియామక పత్రాలను అందించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచారం చేస్తున్న సమితి సభ్యులు

మంచిర్యాలఅర్బన్: పాల్గుణమాసం ప్రారంభ సందర్భంగా స్థానిక బైపాస్‌రోడ్‌లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరస్వామి రచించిన 100 ఆధ్యాత్మిక రచనలను ఇంటింటా పరిచయ కార్యక్రమం చేశారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూజ్ఞాన వేదిక లక్సెట్టిపేట్ కమిటీ అధ్యక్షుడు రాజు, సభ్యులు రాకేశ్, లావణ్య అనుతేజ్, నాగిరెడ్డి, మధు, రవళి, సామిలత్ రష్మిత, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రామ్‌రాజయ్యకు నివాళి



నివాళులర్పిస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: బీఎస్‌ఆర్‌కెఎస్ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు రామ్‌రాజయ్య సంతాప సభను జిల్లా కేంద్రంలో నిర్వహించి, సభ్యులు నివాళులర్పించారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన ఘనత రాజయ్యదని కొనియాడారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెద్దపల్లి సూరన్న, జిల్లా అధ్యక్షుడు పడాల రామన్న, ప్రధాన కార్యదర్శి మంచెర్ల సదానందం, మంచిర్యాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్, తుల మధుసూదన్, బెల్లంకొండ మురళి, నరెడ్ల శ్రీనివాస్, ఏదునూరు రమేశ్, మక్కా మురళి, బింగి టీకయ్య, పెంచాల శ్రీనివాస్, పొట్టాల మల్లేశ్, మెరుగు శ్రీనివాస్, జాడి దేవరాజ్, సదానందం పాల్గొన్నారు.

పోచమ్మకు మొక్కులు

భీమిని: కన్నెపల్లి మండలం జన్కాపూర్ పంచాయతీ పరిధిలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్థానిక వాగులోని గండాలలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం నైవేద్యం వండి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో చెట్లకింద వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేసి తిరుగుపయనయ్యారు.

పోస్టర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న ఎస్సై రాజశేఖర్

మందమర్రిరూరల్: స్థానిక సింగరేణి హైస్కూల్ మైదానంలో ఈనెల 4న క్రేజీ డ్యాన్స్ అకాడమీ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకుడు అంతడుపుల నాగరాజు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో వార్షికోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఎస్సై రాజశేఖర్‌తో కలిసి సభ్యులు ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా ప్రజాకవులు, కళాకారులు హాజరవుతారని తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేశ్, డ్యాన్స్ మాస్టర్ రాకం సంతోష్, రాజమౌళి, సకినాల శంకర్, తదితరులు ఉన్నారు.

నేడు పత్తి కొనుగోలు నిలిపివేత

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని వేంకటేశ్వర సీసీఐ జిన్నింగ్ మిల్లులో సోమవారం పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. మిల్లులో పత్తి నిల్వలు పేరుకుపోవడంతో కొనుగోలు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

రోడ్లపైనే మురుగునీరు



హైటెక్‌సిటీ కాలనీలో రోడ్డుపై పారుతున్న డ్రెయినేజీ నీరు

- పట్టణాల్లో సంచరిస్తున్న పందులు
- పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తం
- కార్పొరేషన్‌గా మారినా కానరాని చర్యలు



జిల్లా కేంద్రంలోని రోడ్లపై పందుల సంచారం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీలతోపాటు హాజీపూర్ మండలంలోని 8 గ్రామాలు కలిసి మంచిర్యాల కార్పొరేషన్‌గా ఏర్పడి నెల దాటింది. అయినప్పటికీ పారిశుద్ధ్య సమస్యను అధిగమించడంలో ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయి. మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా మారితే అభివృద్ధి చెందడంతోపాటు, పారిశుద్ధ్య సమస్యలకు చెక్ పడుతుందని భావించినా, ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పట్టణ శివారు ప్రాంతాల్లో డ్రెయినేజీల నిర్మాణం లేక, మురుగునీరు రోడ్లపై పారుతోంది. హైటెక్‌సిటీకాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నీరు రోడ్డుపై చేరడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. పందుల బెడద వల్ల దోమల వృద్ధి చెందడంతో జనం రోగాల బారిన పడుతున్నారు. కార్పొరేషన్ ఏర్పాటుకు ముందు మంచిర్యాల మున్సిపాలిటీలో 311 మంది, నస్పూరులో 155 మంది, హాజీపూర్ మండలంలోని 8 గ్రామాల్లో 10 మంది కార్మికులు పనిచేస్తున్నారు. కార్పొరేషన్‌లో విలీనమైన తర్వాత ఆ కార్మికులతో పారిశుద్ధ్య పనులను చేపడుతున్నారు.

ప్రణాళికతోనే మెరుగు!

మంచిర్యాల కార్పొరేషన్‌గా ఏర్పడిన తర్వాత పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు సరైన ప్రణాళికతో పనులను చేపడితే మెరుగైన ఫలితాలు వస్తాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో ఉన్న కార్మికుల సంఖ్యకు ప్రస్తుతం మరికొందరి నియమించుకుని, ప్రతీ వార్డులోని చెత్తాచెదారం తొలగింపు, డ్రెయినేజీలోని మురుగునీరు రోడ్లపైకి చేరకుండా చర్యలను తీసుకోవాల్సి ఉంది. మంచిర్యాల జిల్లా కేంద్రంగా ఉండడం, రైలు, జాతీయ రహదారులను కలిగిన ప్రాంతం కావడంతో, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఇక్కడ నివాసం ఉంటున్నారు. మంచిర్యాల వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో ఒకటి. తగినంత మంది కార్మికులను నియమించుకుని ప్రత్యేక ప్రణాళిక చేపట్టి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

డంపింగ్ యార్డులు లేవు

మంచిర్యాలలో ప్రతీరోజు 45 మెట్రిక్ టన్నుల చెత్త, నస్పూర్‌లో 20 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. ఈ రెండు ప్రాంతాలకు శాశ్వత డంపింగ్ యార్డులు లేవు. మంచిర్యాలలోని చెత్తను ఆండాళమ్మ కాలనీలోని డంపింగ్‌యార్డులో వేస్తుండగా, స్థలం తక్కువగా ఉండడం, సమీపంలోనే కాలనీలు ఏర్పడడం ప్రజలకు ఇబ్బందిగా మారుతోంది. నస్పూరులోని చెత్తను ఆర్‌కే 5 ఏరియాలో ఏర్పాటు చేసిన సింగరేణి స్థలంలో చెత్తను వేస్తున్నారు. చెత్తను వేసేందుకు కార్పొరేషన్‌కు డంపింగ్ యార్డు అవసరం ఎంతో ఉండగా, స్థలాన్ని నస్పూర్‌లో కేటాయించినా, ఇంకా అందుబాటులోకి రాలేదు. పారిశుద్ధ్యంను మెరుగుపర్చేందుకు డంపింగ్ యార్డుతోపాటు డ్రెయినేజీల నిర్మాణం తప్పనిసరి.

కార్మికులను తీసుకుంటాం



మంచిర్యాల కార్పొరేషన్‌గా మారిన తర్వాత విస్తీర్ణం పెరిగింది. గతంలో పనిచేస్తున్న కార్మికులతోనే ప్రస్తుతం పారిశుద్ధ్య పనులను చేపడుతున్నాం. ఇంకా ఎంతమంది కార్మికులు అవసరమనే దానిపై కసరత్తు చేస్తున్నాం. అవసరాన్ని బట్టి కార్మికులను తీసుకుంటాం. అప్పటివరకు ఉన్న కార్మికులతోనే పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– శివాజీ, కార్పొరేషన్ కమిషనర్

జోరుగా మొక్కజొన్న సాగు

- పెరళ్లలో సైతం
- తక్కువ పెట్టుబడి
- రైతులకు అధిక లాభాలు



సుందరసాల సమీపంలో సాగవుతున్న మొక్క జొన్న

చెన్నూర్‌రూరల్: వేసవిలో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉంది. దీంతో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. యాసంగిలో రైతులు మొక్కజొన్న పంటల వైపు దృష్టి సారిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,884 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. చెన్నూర్ మండలంలోని సుద్దాల, కత్తెరసాల, సుందరసాల, మందపూరం, చింతలపల్లి, సుబ్బరాంపల్లి, దుగ్నెపల్లి, నారాయణపూర్, రాయిపేట, కొమ్మెర, పొక్కూరు తదితర గ్రామాల్లో రైతులు ఇళ్లలో ఉన్న పెరళ్లతోపాటు, పొలాలు, చేన్ల వద్ద ఈ పంటలను సాగు చేస్తున్నారు. హైబ్రిడ్ మొక్కజొన్న సాగు చేయగా కేవలం 60 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఈ సాగుకు నీటి అవసరం ఎక్కువగా ఉండదని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని గ్రామాల రైతులు పేర్కొంటున్నారు. వేసవిలో పశుగ్రాసం కొరత ఎక్కువగా ఉంటుందని, పశువుల మేత కోసం అల్లాడే పరిస్థితి ఏర్పడకుండా ఈ పంటను సాగు చేస్తున్నామని చెబుతున్నారు. పంట చేతికొచ్చిన తర్వాత ఒక్కో మొక్కజొన్న కంకికి రూ.8 వరకు గిట్టుబాటు ధర పలుకుతుందని, మొక్కజొన్న కర్రలు పశువులకు మేతకు ఉపయోగపడుతాయని పేర్కొంటున్నారు.

ఎకరంలో సాగుచేస్తున్నా



ఎకరంలో మొక్కజొన్న సాగు చేస్తున్నాను. పంటలు సరిగా పండక పశువులకు పశుగ్రాసం లేదు. మొక్కజొన్న పశువులకు మేతగా ఉపయోగ పడుతుంది. ఈ పంట సాగుకు నీరు కూడా ఎక్కువగా అవసరం ఉండదు.

– గట్టయ్య, రైతు, లింగంపల్లి

నీటి అవసరం ఉండదు



కూరగాయల సాగుతో పాటు మొక్కజొన్న సాగు చేస్తున్నాను. నీరు లేక పోవడంతో ఈ పంట సాగు చేస్తున్నాను. ప్రతి ఏటా యాసంగిలో ఈ పంట సాగు చేస్తున్నాను. నీటి అవసరం ఎక్కువగా ఉండదు. పంట త్వరగా చేతికి వస్తుంది.

– భాస్కర్‌రెడ్డి, రైతు, అంగ్రాజ్‌పల్లి

దాడికి యత్నించినవారిని శిక్షించాలి

చెన్నూర్: పట్టణానికి చెందిన బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ నాయకుడు శివకృష్ణ ఇంటిపై దాడికి యత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని కత్తెరశాల మల్లికార్జున స్వామి ఆలయ సమీపంలో కొందరు పేకాట ఆడారని తెలిపారు. పవిత్ర జాతర నిర్వహించే గ్రామంలో పేకాట ఆడడాన్ని గమనించిన శివకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. వారు శివకృష్ణపై కక్ష పెట్టుకొని ఆదివారం ఆయన ఇంటిపై దాడికి యత్నించారని తెలిపారు. వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, నాయకులు దుర్గం ఆశోక్, నర్సయ్య, సమ్మయ్య, కమ్మల శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

పొగతో ఉక్కిరిబిక్కిరి



బెల్లంపల్లి బస్తీకి వెళ్లే రోడ్డు పక్కన కాలబెడుతున్న చెత్త నుంచి వెలువడుతున్న దట్టమైన పొగ

- డంప్‌యార్డులో కాలుస్తున్న చెత్త
- వాయు కాలుష్యంతో ప్రజలకు ఇబ్బంది
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

బెల్లంపల్లి: వాయు, పొగకాలుష్యం పురప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రోడ్ల పక్కన వీధుల్లో, కూడళ్లతోపాటు డంప్‌యార్డులో రోజువారీగా చెత్త చెదారాన్ని కాలుస్తుండటంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. భరించలేని కంపువాసనతో ముక్కు పుటలను అదరగొడుతుండగా వ్యర్థపదార్థాలను తగులబెడుతుండటంతో వాయుకాలుష్యం ప్రబలి ప్రజలు సతమతమవుతున్నారు. ద్వితీయశ్రేణి బెల్లంపల్లి మున్సిపాలిటీ వాయుకాలుష్యానికి నిలయంగా మారుతోంది. ఎక్కడపడితే అక్కడ చెత్త, వ్యర్థపదార్థాలను కాలబెడుతున్నారు. దీంతో నల్లని పొగ ఇళ్ల పరిసరాలు, రోడ్ల పక్కన దట్టంగా వ్యాపించి వేస్తోంది. ఆ పొగను ప్రజలు పీల్చుకోవల్సిన పరిస్థితులు ఉంటున్నాయి. ఈ కారణంగా అనేకమంది శ్వాసకోశ వ్యాధుల బారినపడుతున్నారు. దగ్గు, దమ్ముతోపాటు ఊపిరితిత్తుల సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. ప్రజారోగ్యాన్ని ప్రభావితం చేస్తున్న వాయు, పొగ కాలుష్యాన్ని నివారించడంలో సంబంధిత అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఎక్కడికక్కడే చెత్త

మున్సిపాలిటీలో 34 వార్డులు ఉండగా వీటిద్వారా రోజుకు గరిష్టంగా దాదాపు 25 మెట్రిక్ టన్నుల వరకు చెత్త జమ అవుతోంది. అయితే పేరుకుపోయిన చెత్తను వెంటనే డంప్‌యార్డుకు తరలించకపోవడంతో ఎక్కడికక్కడే చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. రోడ్డుపై వెళ్లే పాదాచారులు, వాహనదారులు నిల్వ ఉండిపోయిన చెత్తపై సిగరేట్ తాగి విసరేయడంతో క్షణాల్లో నిప్పంటుకుంటోంది. ప్లాస్టిక్, ఇనుప వస్తువుల సేకరణ కోసం వెళ్తున్న వ్యక్తులు డంప్‌యార్డులో పేరుకుపోయిన చెత్తను కాలబెడుతున్నారు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది సరైన అవగాహన లేక చెత్తను పోగు చేసి ఏకంగా నిప్పంటిస్తున్నారు. దీంతో పొగ, వాయుకాలుష్యం ప్రబలుతోంది.

రోగాల బారిన ప్రజలు

రోడ్డుపై బస్సు, లారీ, వ్యాన్లతోపాటు ఆటోరిక్షాలు వెళ్తున్న దుమ్ము, ధూళీ వెదజల్లుతోంది. దీనికితోడు వ్యర్థ పదార్థాలను కాల్చడం వల్ల వాయుకాలుష్యం ఏర్పడుతోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. శ్వాసకోశ సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే పట్టించుకుని వాయు, పొగ కాలుష్యం ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని పురప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



రోడ్ల పక్కన, డంప్‌యార్డు, బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం, వ్యర్థపదార్థాలను కాల్చకుండా చర్యలు తీసుకోవాలి. రోజువారీగా సేకరించిన చెత్తను వెంటనే డంప్‌యార్డుకు తరలించాలి. డంప్‌యార్డులో ఎవరిని అనుమతించకుండా చెత్తకు నిప్పంటించకుండా చూడాలి.

– మహేశ్‌కుమార్ శర్మ, బెల్లంపల్లి

అధికారులు శ్రద్ధపెట్టాలి



వాయు, పొగ కాలుష్యం ప్రమాదకరమైనవి. కలుషితమైన గాలిని పీల్చడం వల్ల శ్వాసకోశ సమస్యలకు కారణమవుతుంది. స్వచ్ఛమైన గాలి బెల్లంపల్లిలో కరువైంది. దుమ్ముధూళీతో నిండిన ప్రదేశాలు, కాలుష్యాన్ని వెదజల్లే పొగను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రజారోగ్యంపై మున్సిపల్ అధికారులు శ్రద్ధపెట్టాలి.

– జాగటి శ్రీనివాస్, బెల్లంపల్లి

ఘనంగా శ్రీపాదరావు జయంతి



జైపూర్: నివాళులర్పిస్తున్న అధికారులు



శ్రీరాంపూర్: పూలమాలలు వేస్తున్న జీఎం

శ్రీరాంపూర్: మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీపాదరావు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద సింగరేణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి శ్రీరాంపూర్ జీఎం ఎం. శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ శ్రీపాదరావు రాష్ట్ర రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా, స్పీకర్‌గా మంత్రిగా అనేకసార్లు సేవలు అందించారని గుర్తుచేశారు,. ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి టి.శ్రీనివాస్, ఏజెంట్ శ్రీధర్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, డిప్యూటీ పీఎం రాజేశ్వరరావు, ఇంజినీర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జైపూర్: మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్లు తిరుపతి, మల్లేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ కార్యాలయంలో శ్రీపాదరావు జయంతిని నిర్వహించారు. కమిషనర్ తొటం శివాజీ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మందమర్రిరూరల్: నివాళులర్పిస్తున్న ఎంపీడీవో

మందమర్రిరూరల్: ఎంపీడీవో కార్యాలయంలో శ్రీపాదరావు జయంతిని నిర్వహించారు. ఎంపీడీవో రాజేశ్వర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఏరియాలోని కేకే ఓసీ ఆవరణలో మేనేజర్ రామరాజు ఆధ్వర్యంలో శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీవైఎస్‌ఎస్‌వో రవీందర్, అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పందేలు



విజేతలకు నగదు ప్రోత్సాహాన్ని అందిస్తున్న నాయకులు శ్రీనివాసరావు, సత్తయ్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్‌లో మాజీ జెడ్పీటీసీ పూస్కూరి శిల్పశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం తొలిసారిగా ఎడ్ల పందేలు నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన పలువురు రైతులు తమ ఎడ్లబండ్లతో పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వారికి స్థానిక నాయకులు పూస్కూరి శ్రీనివాసరావు, ఆకుతోట సత్తయ్య, జూపాక ధర్మయ్య తదితరులు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.

బర్డ్ ఫెస్టివల్‌లో జన్నారం విద్యార్థులు



అటవీశాఖ అధికారితో జన్నారం విద్యార్థులు

జన్నారం: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కవ్వాల్ బర్డ్ ఫెస్టివల్ కార్యక్రమానికి జన్నారంలోని పలు పాఠశాలల విద్యార్థులు వెళ్లారు. అటవీశాఖ అధికారులు నిర్వహించిన అవగాహ న కార్యక్రమానికి వెళ్లి పక్షులు, వాటి ఉపయోగాలు, జీవ వైవిధ్యంలో పక్షులపాత్ర తదితర అంశాలపై అవగాహన పెంచుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్ విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారని ఉపాధ్యాయులు తిరుపతి, మహేశ్ తెలిపారు.